ప్రజాశక్తి

ఆదివారం 27 ఆగస్టు 2023

5

శ్రీకాకుళం

బిఎస్‌ఎన్‌ఎల్‌లో ఉచిత 4జి సిమ్

శ్రీకాకుళం అర్బన్ : మొబైల్ రంగంలో 4జి సాంకేతికతను దేశవ్యాప్తంగా వచ్చే రెండు నెలల్లో బిఎస్‌ఎన్‌ఎల్ ప్రవేశపెడుతోందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ కొంతమంది వినియోగదారులు 3జి సిమ్ ద్వారానే మొబైల్ సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. 4జి సేవలు పొందాలంటే 3జి సిమ్ వినియోగదారులు తమ సిమ్‌ను మార్చుకోవాలని సూచించారు. వచ్చే నెల 30వ తేదీ లోగా డిజిటలైజేషన్ చేయించుకుని 4జిలోకి మార్చుకోవాలని తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం, ఫ్రాంచైజీ, రిటైలర్ వద్ద ఉచిత 4జి సిమ్ అప్‌గ్రేడేషన్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న ప్రస్తుత సిమ్ 3జి, 4జి అన్న విషయాన్ని తెలుసుకునేందుకు SIM అని టైప్ చేసి 9441299999 నంబరుకు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

30 నుంచి సమరభేరి

- ప్రజల కష్టాలు పట్టని ప్రభుత్వాలు
- కార్పొరేట్లకు రాయితీలు, పేదలపై భారాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి ఆగస్టు నాలుగు తేదీ వరకు సమరభేరి నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం కార్యాలయంలో ప్రచార కార్యక్రమాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో, అధిక ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజానీకం జీవనం కష్టంగా మారిందన్నారు. మోడీ గద్దెనెక్కిన వెంటనే రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు రూ.1200కు పెరిగిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలూ పెరిగాయన్నారు. కాయగూరల ధరలు ఈనెలలో 37 శాతం పెరిగాయని, పప్పు ధాన్యాలు 45 శాతం పెరిగాయని వివరించారు. 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం, ఉద్యోగాలు ఇవ్వలేదు సరే కదా పరిశ్రమలు మూతపడి లక్షలాదిమంది ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఉపాధి హామీకి నిధులు తగ్గిస్తూ ఎత్తివేయడానికి చూస్తోందని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు తగ్గించిందని గుర్తుచేశారు. ప్రజలపై పన్నుల భారాల మోపుతూ, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీ ఇస్తోందని విమర్శించారు.

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆ హామీని గాలికొదిలేసి ఏడుసార్లు పెంచారని చెప్పారు. ఇప్పుడు నెలవారీ పెంపుదలకు రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. లోటు భర్తీ పేరుతో ఛార్జీలు, సర్‌ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఛార్జీలు తదితర పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై మోపుతున్నారని వివరించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, అధిక ధరలు అరికట్టాలని కోరుతూ ఈనెల 30వ తేదీ నుంచి ప్రచారం, సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీన గ్రామ వార్డు, సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేత, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయ వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు వివరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోవిందరావు, కృష్ణమూర్తి

అపరిష్కృత అర్జీలపై దృష్టి

- అర్జీలు రీ ఓపెన్ కారాదు
- సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, జలుమూరు

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే వినతుల్లో అపరిష్కృత అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించాలని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అధికారులను ఆదేశించారు. అందిన అర్జీలన్నింటినీ శతశాతం పరిష్కరించాలని, తద్వారా అర్జీదారులు సంతృప్తి చెందాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, గృహనిర్మాణ సంస్థ తదితర శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏ శాఖలోనూ అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. ఎక్కువ అర్జీలు పెండింగ్ ఉన్న శాఖలతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీ కాలపరిమితి లోగా పరిష్కారం కావాలని, కాలపరిమితి దాటిన వాటికి సరైన కారణాలు ఉండాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కారాదన్నారు. సరైన సమాధానం లేదా పరిష్కారంతోనే ఇటువంటివి పునరావృతం కావన్న విషయాన్ని అధికారులు గ్రహించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, ఆర్‌డిఒ బి.శాంతి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, గృహనిర్మాణ సంస్థ, ఐసిడిఎస్ పీడీలు ఎన్.గణపతి, జి.జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక వసతులను కల్పించాలని సిద్ధార్థ్‌జైన్ అన్నారు. ఈనెల 30న వర్చువల్ విధానంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్న జలుమూరు మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస జగనన్న కాలనీని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి పరిశీలించారు. జగనన్న కాలనీకి ప్రవేశ ద్వారం వద్ద ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వల్ల వస్తున్న దుర్వాసతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వేరేచోట స్థలం కేటాయించి అక్కడ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ బి.సత్యంను ఆదేశించారు. అనంతరం కరవంజలోని సచివాలయం, రైతుభరోసా కేంద్రం, ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎంపిపి వాన గోపి, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న సర్వే, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్

టాస్క్‌ఫోర్స్ సేవలు కీలకం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సేవలు కీలకమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి జంగిల్ షూస్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమోఘమైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో కొన్నిచోట్ల అనుకోని పరిస్థితుల్లో ఘర్షణలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన సందర్భంలో స్థానిక పోలీసులున్నా, పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంలో టాస్క్‌ఫోర్స్ పాత్ర కీలకమన్నారు. రథసప్తమి, శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాలు వంటి వేలాది మంది యాత్రికులు వచ్చినప్పుడు ప్రశాంతంగా కార్యక్రమం నిర్వహించడంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అవసరమన్నారు. ప్రతిఒక్కరూ మరింత క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి డి.ప్రసాదరావు, ఆర్‌ఐ ఉమామహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జంగిల్ షూస్‌ను అందిస్తున్న ఎస్‌పి రాధిక

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

వివాద రహిత గ్రామాల గుర్తింపు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వివాద రహిత గ్రామాలను గుర్తించి మోడల్ గ్రామాలుగా ఎంపిక చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీసు, లేబర్, గిరిజన సంక్షేమ శాఖ తదితర శాఖల అధికారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని గ్రామాలన్నీ సర్వే చేసి ఏవిధమైన సివిల్, క్రిమినల్, వాజ్యాలు, గొడవల్లేని గ్రామాలను గుర్తించాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి వివాదరహిత గ్రామాలను నిర్ణయిస్తారని తెలిపారు. వివాద రహిత గ్రామాలను గుర్తించేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏవైనా గ్రామాలు మోడల్ గ్రామాలుగా గుర్తించడానికి అవకాశమున్న గ్రామాల పేర్లు సూచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎఎస్‌పి తిప్పేస్వామి, డిఆర్‌ఒ పి.మురళీకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.అజయ్ కార్తికేయ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి కె.వి రమణ, గవర్నమెంట్ న్యాయవాది వినయభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- లైసెన్స్‌ల రద్దుకూ వెనకాడం
- వ్యవసాయ అధికారుల హెచ్చరిక
- ఎరువుల దుకాణాల్లో తనిఖీలు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - బూర్జ, వజ్రపుకొత్తూరు

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. ప్రజాశక్తిలో ఈనెల 25వ తేదీన 'మమ్మల్ని అడిగేదెవరు?' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పలు మండలాల్లో శనివారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ జెడి ఆదేశాల మేరకు తలోవైపు పరుగులు తీసి తనిఖీలను ముమ్మరం చేశారు. శ్రీకాకుళం, కొత్తూరు, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో పర్యటించి పలు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం, కొత్తూరు వ్యవసాయ శాఖ ఎడిలు రజని, రాజగోపాలరావు కొల్లివలసలో ఎరువు దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల దుకాణదారుల వ్యవహారంపై రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వం నిర్ధేశించిన ధరల కన్నా ఎక్కువ ధరలకు ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువుల దుకాణాదారులపై రైతుల నుంచి ఫిర్యాదు వస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వీరితోపాటు మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో...

వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు కె.రవీంద్రభారతి వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లో పలు ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మి గణపతి ఏజెన్సీ, సాయిరాం ఏజెన్సీలో ఎరువుల రికార్డులను పరిశీలించారు. ఎరువులు కొనే ముందు బస్తాలను తూకం వేసి అనంతరం డీలర్ నుంచి బిల్లును పొందాలని రైతులకు సూచించారు. స్టాక్ బుక్, ఈపాస్ గోడౌన్‌లో నిల్వ లెక్క సరిగా ఉండాలన్నారు. డీలర్లు రైతులకు చేతితో రాసిన బిల్లు మాత్రమే ఇవ్వాలని, కంప్యూటర్ బిల్లులను వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా ఇస్తే నేరంగా పరిగణిస్తామన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేసి ఎంఆర్‌పి రేట్లు అమలు చేయాలని సూచించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి కిరణ్ వాణి, ఎఇఒలు ఉదయ్ కుమార్, జ్యోత్స్న పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

రేపు వైసిపి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నరసన్నపేట

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఈనెల 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కుటుంబ సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల 46 మందితో ప్రకటించిన నూతన జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ప్రజాసేవలో 'రోటరీ'

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నిరంతరం పేదల సేవలోనే రోటరీ సంస్థ ఉంటుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ సుబ్బారావు అన్నారు. శనివారం సాయంత్రం శ్రీకాకుళంలోని రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో 20 మందికి కుట్టు మిషన్లు, ట్రెనింగ్ పొందిన 70 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోటరీ సెంట్రల్ అధ్యక్షులు యెరుకోల మురళీమోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సుబ్బారావు మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షులు యెరుకోల మురళీమోహనరావు కోరిక మేరకు శ్రీకూర్మం, అరసవల్లి దేవస్థానాల్లో శాశ్వత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదిస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది యెరుకోల మురళీమోహనరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ రోటరీ అని తెలిపారు. తాను అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత నెల రోజుల్లోనే శ్రీకాకుళం నగరంలోని ఏఎస్ఎన్ కాలనీలో పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ 500 మొక్కలు నాటామన్నారు. విశాఖ బీ కాలనీలో షిరిడీ సాయిబాబా మందిరం వద్ద పిల్లలు, మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అందుకుగాను రోటరీ సంస్థ తనకు ప్రథమ పురస్కారాన్ని అందజేసిందని వివరించారు. వెనకబడిన జిల్లాలో ఉన్న తమ ప్రాంతానికి రోటరీ సంస్థ సహకారం అందించాలని కోరారు. అనంతరం గవర్నర్ సుబ్బారావు లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, వరదా కొండబాబు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె టి నాయుడు, కే నాగేశ్వరరావు, సెక్రటరీ కేవీఎస్ వి దుర్గారావు, సభ్యులు కోరాడ హరగోపాల్, వైకుంఠరావు, ఎన్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ప్లాస్టిక్ నిషేధంతోనే పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్లాస్టిక్ నిషేధించి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్ నారాయణ రావు అన్నారు, శనివారం స్థానిక మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రైవేటు కళాశాలలో కూడా ఈ క్లబ్బులు ప్రారంభించామన్నారు. ప్లాస్టిక్ నిషేధం, వాటివల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు.

సైకిల్ తొక్కడం, మట్టి పాత్రలు వాడడం, ఇంటిదగ్గర తయారుచేసిన వంటను తినడం ఆరోగ్యానికి మంచిదని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ఎం. కష్ణవేణి మాట్లాడుతూ యువ క్లబ్‌ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు, కళాశాల లెక్చరర్లు రాజేశ్వరి, అప్పారావు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

భారత రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకమని ఐలు జిల్లా అధ్యక్షులు దుంపల రమణారావు అన్నారు. బార్ అసోసియేషన్ నూతన భవనంలో శ్రీకాకుళం బార్ ఐలు సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంపై దాడి జరుగుతోందని దీన్ని న్యాయవాదులు, మేధావులు, అభ్యుదయవాదులు అభ్యుదయవాదులు ప్రతిఘటించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను న్యాయవాదులు కాపాడాలని పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం శ్రీకాకుళం బార్ ఐలు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అంధవరపు వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా పి.లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా డొంకాన ఈశ్వరరావు ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న ఐలు జిల్లా అధ్యక్షులు రమణారావు

కళ్లెం లేని రథ సారధ్యమేనా?

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపిలో ఎట్టకేలకు పూర్తిస్థాయి జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ ఏర్పాటు చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ 43 మంది సభ్యులతో జిల్లా కమిటీని నియమించింది. ఈనెల 28వ తేదీన అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రమాణ స్వీకారోత్సవానికి ముహూర్తం కూడా ప్రకటించారు. 2018 నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పాటు చేసుకోవడంలో పార్టీ విఫలమైంది. 2018లో రెడ్డి శాంతికి పార్టీ పగ్గాలు అప్పగించినా కమిటీని నియమించలేదు. ఆ తర్వాత ప్రస్తుత శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న సందర్భంలో అసంపూర్ణంగానే కమిటీని ఏర్పాటు చేశారు. 2021లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగిన సందర్భంలో అప్పటివరకు డిప్యూటీ సిఎంగా పనిచేసిన ధర్మాన కృష్ణదాస్‌ను మంత్రివర్గం నుంచి తప్పించి పార్టీ అధ్యక్ష పదవిని అధిష్టానం కట్టబెట్టింది. ఆ సమయంలోనూ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి తప్ప ఇతర ఏ సంస్థాగత పదవులనూ భర్తీ చేయలేదు. రెండేళ్లుగా ఆ ఇద్దరితోనే నెట్టుకొచ్చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం లేదని, పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదనే విమర్శలు రావడంతో నూతన కార్యవర్గం ఏర్పాటుకు నిర్ణయించింది. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ అవసరాన్ని గుర్తించింది. నియోజకవర్గం నుంచి ముగ్గురు, నలుగురు పేర్లను పంపాలని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు సూచించిన తర్వాత వాటిని పరిశీలించి వడపోత అనంతరం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. ఎన్నికల టీమ్ అని కొందరు, ఎన్నికల రథసారథి దాసన్న అంటూ మరికొందరు కీర్తిస్తుండగా పార్టీ కేడర్‌లో మాత్రం మునుపటి ఉత్సాహం కొరవడిందన్న విమర్శలు సొంత పార్టీ నాయకుల్లోనే వినిపిస్తోంది. కొత్త కార్యవర్గం ఏర్పాటులో కొత్తదనమేముందంటూ పార్టీలో కొందరు నాయకులు పెదవి విరుస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రెండు మూడు పర్యాయాలు మాత్రమే సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అందులోనూ కార్యకర్తలు తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై కొందరు నాయకులు అంతర్గత చర్చల్లో మదనపడ్డారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల వరకు శ్రేణుల్లో మంచి ఉత్సాహం కనిపించింది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఏడాది వరకు ఆ జోష్ కొనసాగింది. పంచాయతీలకు చెందిన నిధులు ప్రభుత్వం తీసుకోవడం, అధికారాలు, విధులు లేకుండా సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చడంతో వారిలో నిస్తేజం అలుముకుంది. గ్రామాల్లో చేపడుతున్న సచివాలయాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లను సర్పంచ్‌లతో పాటు ఎంపిటిసిలు, స్థానిక వైసిపి నాయకులు అప్పులు చేసి చేస్తున్న పనులకు డబ్బులు రాకపోవడంతో వారిలోనూ నైరాశ్యం నెలకొంది. వీరిని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేయడం నూతన కార్యవర్గానికి పెద్ద సవాలే కానుంది.

వైసిపి అధిష్టానం జిల్లా కమిటిని ఏర్పాటు చేస్తున్నా, పార్టీ నియమావళిని ఉల్లంఘిస్తున్న చర్యలు తీసుకోలేని స్థితిలో అధ్యక్షులు ఉన్నారు. రెండేళ్లుగా పార్టీ బాధ్యతలను చూస్తున్న ధర్మాన కృష్ణదాస్ ఒకట్రెండు సందర్భాల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిని, గ్రూపులు కట్టే వారిపై ఉపేక్షించబోమని చర్యలు తీసుకుంటామని చెప్పినా అవి మాటలకే పరిమితమయ్యాయి. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పార్టీ రెండు, మూడు గ్రూపులుగా చీలింది. ముఖ్యంగా ఎచ్చెర్ల, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీల తీరుపై అసమ్మతిగళం వినిపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వ్యవహార శైలి గిట్టని వారంతా ఒకే తాటిపైకి వచ్చి అసమ్మతి గళం వినిపిస్తున్నారు. జగన్ ముద్దు, కిరణ్ వద్దంటూ ఏకంగా రోడ్డెక్కిన పరిస్థితిని మనం చూశాం. పాతపట్నం నియోజకవర్గంలోనూ సుమారు ఇదే పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కొత్తూరు వైస్ ఎంపిపి తులసీ వరప్రసాద్, పార్టీ నాయకులు మామిడి శ్రీకాంత్ ముగ్గురూ పార్టీ తరుపున తిరుగుతున్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైస్ ఎంపిపి తులసీ వరప్రసాద్ గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉంది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసు కేసులు పెట్టుకుంటున్నారు.

మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు నియోజకవర్గంలోనూ తీవ్ర అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. మంత్రి ఒంటెత్తు పోకడలు, పదవుల పంపకాల్లో సీనియర్లకు అన్యాయం చేయడం వంటి చర్యలతో అసమ్మతిని మూటగట్టుకుంటున్నారు. మంత్రి వ్యతిరేకీయులంతా ఏకమై ఓడించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. ఇచ్ఛాపురం నియోజవర్గంలో అంతా కలిసి ఉన్నట్లుగానే కనిపిస్తున్నా, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అనుచరులు రెండు గ్రూపులుగానే ఉన్నారు. టెక్కలి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో నెలకొంది. టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్ మధ్య కొంతకాలం గ్రూపుల పోరు నడిచింది. దానికితోడు ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబంలో నెలకొన్న విబేధాలు రచ్చకెక్కడంతో పార్టీ పరువు పోయింది. పార్టీ అధిష్టానం దువ్వాడ శ్రీనివాస్‌ను తొలగించి ఆయన సతీమణి దువ్వాడ వాణికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించింది. దువ్వాడ కుటుంబానికి ఇంటా బయట పోరుతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అయోమయంగా మారింది. ఎన్నికల కమిటీ, ఎన్నికల రథ సారథులంటూ కీర్తిస్తున్న తరుణంలో పార్టీలో నెలకొన్న విబేధాలను ఎంతవరకు పరిష్కరించగలదు, అసమ్మతిని ఏమేరకు చల్లార్చగలదన్నది చూడాల్సి ఉంది.

CHANGE OF NAME

I ANDA APPANNA S/o Chinna Rao, Aged 29 years, Hindu, R/o Door No. 3-26, Chandra Nagar, Apparaopeta Colony, Polaki Mandalam, Srikakulam Dist. Change my Name From **ANDA APPANNA** (Old name) to **AYAAN ISHAANWAALI ANDA** hence forth will be known as **AYAAN ISHAANWAALI ANDA.**

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శ్రీకాకుళం

O S. 593/2022.

Between:

యాళ్ల రాజశేఖర్ --వాది

And :

యాడకుల శంకర్ S/o అప్పారావు కొత్తపేట మడపాం గ్రామం నరసన్నపేట మండలం శ్రీకాకుళం జిల్లా --ప్రతివాది

పై నెంబరు కేసులో వాది ప్రతివాది పై సొమ్ము వసూలుకు వేసిన వాజ్యం **OS 593 /2022 తేదీ 31-08-2023.** నకు ప్రతి వాది యొక్క హాజరుకు వాయిదా వేసి యున్నది. కావున పై వాజ్యం నందు ప్రతివాది నకు ఎట్టి ఆక్షేపణలు యున్నను తేదీ 31-08-2023. ఉదయం గం॥ 10.30 నిమిషములకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై వాదనలు దాఖలు చేసుకొనవలెను లేనియెడల ప్రతివాది పరోక్షమున వాజ్యమును కోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఆదేశాలు మేరకు//

అల్లం శెట్టి కిషోర్ కుమార్
న్యాయవాది
అరసవల్లి,శ్రీకాకుళం
సెల్: 9346658601.

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

అవినీతి ప్రభుత్వాన్ని అంతం చేయాలి

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- బూర్జ

అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని అంతం చేసేవరకు ప్రతి ఒక్కరూ నిద్రపోవద్దని ఎంపీ రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శనివారం బూర్జ మండలంలో కొరగాం గ్రామంలో జరిగే ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలన అక్రమాలను అందరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రాష్ట్రంలో శాశ్వత అభివద్ధి ఒక్కటి కూడా జరగలేదన్నారు. చంద్రబాబు గెలుపు కోసం పనిచేయాలని కోరారు. 2024 ఎలక్షన్లో టిడిపి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు పెద్దఎత్తున తెలుగుదేశం కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి కుటుంబమూ ఉన్నత విలువలతో తమ పిల్లలను పెంచాలని భావిస్తుందని, అందులో భాగంగా మంచివారితో స్నేహం ప్రయోజకులను చేస్తుందని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పిల్లలలో మంచి, చెడ్డ స్పర్శ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం నేర్పాలన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరిలోనూ సోదర భావం, దేశభక్తిని పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిఇఒ వెంకటేశ్వరరావును ఆదేశించారు. విద్యార్థుల నడవడికలో చిన్నతనం నుంచే మార్పులు వస్తాయని, కుటుంబ నేపథ్యం, పెరిగిన వాతావరణ, సహచరులతో మెలగడంలో మంచి, చెడుల మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుపై అంకిత భావం ప్రదర్శించి అన్య ఆలోచనలు లేకుండా లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు.కష్టపడి చదివి పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ జిల్లా విద్యాశాఖ అధికారి, న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వైదేహి, న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, మెట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

కేసుల రాజీపై ప్రత్యేక దృష్టి

టెక్కలి : సెప్టెంబరు 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా కేసులు రాజీకి వచ్చేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని టెక్కలి మున్సిఫ్ మేజిస్ట్రేట్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజాచక్రవర్తి మల్లా సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో పోసులతో, న్యాయవాదులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షిదారులకు సమయం, ధనం వృథా కాకుండా ఉండేందుకు వీలుగా నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు కేసులు పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో టెక్కలి సిఐ చంద్రమౌళి, ఎస్ఐలు అమీర్ ఆలీ, టి.రాజేష్, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి పోలీసులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి దిక్సూచి 'బొడ్డేపల్లి'

స్పీకర్ సీతారాం, మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

కరువుతో వలసలతో అధారపడి బతుకుతున్న జిల్లా ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధికి 1952లోనే అంకురార్పణ చేసిన మహానేత, రాజకీయ నేతలకు స్ఫూర్తిగా నిలిచిన నాయకుడు మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ కెటి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రాజగోపాలరావు విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం రైల్వే ఇన్స్టిట్యూట్‌లో డాక్టర్ జీవితేశ్వరరావు అధ్యక్షతన జరిగి సభలో సీతారాం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో గుర్తించుకునే నేతల్లో బొడ్డేపల్లి ఒకరని అన్నారు. స్వతంత్రం అనంతరం దేశంలో జరిగిన అనేక విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడిన నేత అని కొనియాడారు. 1952లో జిల్లా నుంచి స్వాతంత్ర అభ్యర్థిగా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని అప్పటి ప్రధాని నెహ్రూ ఆహ్వానిస్తే జిల్లాను సస్యశ్యామలం కోసం వంశధారపై ప్రాజెక్టు నిర్మాణానికి అంగీకరిస్తే పార్టీలో చేరుతానని చెప్పి నాయకుడని అన్నారు. బొడ్డేపల్లి, మార్పు పద్మనాభం, వీరనారి గున్నమ్మ త్యాగాలు

సోంపేట : రాజగోపాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీతారాం

మరువలేనివని కొనియాడారు. అప్పలరాజు మాట్లాడుతూ బొడ్డేపల్లి జిల్లా అభివృద్ధికి చేసిన కృషి, పట్టుదల నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి అని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, పలాస మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైద్యులు దానేటి శ్రీధర్, జీవితేశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బడగల బల్లయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం. ఎల్.వి.చలం, బమ్మిడి నాగేశ్వరరావు, మొదలవలస మన్మథరావు, రోణంకి శాంతికుమారి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, దువ్వాడ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

సోంపేట: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాల్ చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి కూడలి వద్ద ఏర్పాటు చేసిన రాజగోపాలరావు విగ్రహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కేంద్ర మాజీ కిల్లి కృపారాణి, ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, దుక్క లోకేశ్వర్ రెడ్డి, పిరియా సాయిరాజ్, జెడ్‌పిటిసిలు తడక యశోద, ఇప్పిలి లోలాక్షి, ఎంపిపిలు డాక్టర్ దాసు, దేవదాస్‌రెడ్డి, వైద్యులు రాజేంద్రప్రసాద్, దానేటి శ్రీధర్, పి.సూర్యం, రాజగోపాలాచారి పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న సూర్యనారాయణ (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

టిడ్కో డబ్బులు ఎప్పుడు తిరిగి ఇస్తారు?

మున్సిపల్ అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

పలాస: టిడ్కో ఇళ్ల కోసం చెల్లించిన సొమ్ములు ఎప్పుడు చెల్లిస్తారు... రోడ్లపై పశువులు, కుక్కలు విహారం చేస్తున్నా పట్టించుకోరా...అపరిశుభ్రతపై ఇంకా ఎన్నాళ్లీ నిరీక్షణలంటూ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. టిట్కో ఇళ్ల మంజూరు చేస్తారని పేద ప్రజలు రూ. 50 వేలు, లక్ష చొప్పున అప్పులు చేసి డబ్బులు కట్టారని, ఏళు గడుస్తున్నా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు సరికదా జగనన్న గృహాలైనా మంజూరు చేయడం లేదని టిడిపి కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మున్సిపల్ అధికారులను నిలదీశారు. పవర్ బోర్ వేస్తామని సుమారు ఏడాదిన్నరగా ప్రతి సమావేశంలో చెప్పడమే తప్ప ఎందుకు వేయడం లేదని అధికారుల ప్రశ్నించారు. రామలక్ష్మి కాలనీలో తాగునీరు కోసం ప్రజలు అల్లాడి పోతున్నారన్నారు. వార్డులో పారిశుధ్యం లోపించిందని, కాలువల్లో చెత్తాచెదారాన్ని శుభ్ర చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ బల్ల గిరిబాబు స్పందిస్తూ టిడ్కో ఇళ్ల డబ్బులు కమిషనర్ అకౌంట్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే చెల్లిస్తామన్నారు. కాంట్రాక్టరు ముందుకు రాకపోవడం వల్లే పవర్ బోర్ వేయలేక పోయామన్నారు. కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో గోవులను రోడ్లపైకి విడిచిపెడుతున్నారని, వీటితో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుందని అధికారుల దష్టికి తీసుకువెళ్లారు. రోడ్లపై పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు తినడం వల్ల రోగాలు బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలు పితికి ఆవులను రోడ్లు పైకి విడిచిపెడుతున్నా ఆవు యజమానులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ పప్పల ప్రసాద్ మాట్లాడుతూ జంట పట్టణాల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇటీవల కొంత మంది విద్యార్థులకు కుక్కలు కరిచాయని కౌన్సిల్ దష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని చాలా వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు జోగ త్రివేణి, తంగుడు ఆశారాణి, కర్రి మాధవరావు, సనపల సింహాచలం, శార్వాణి గీత ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మీసాల సురేష్ బాబు, కృష్ణారావు, టిడిపి సీతారాం, అప్పలస్వామి, కౌన్సిలర్‌లు దుర్గా శంకర్ పండా, డిక్కల ఆనందరావు, బడగల సుజాత, కో ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌమార దశ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- జలుమూరు

12 నుంచి 18 సంవత్సరాల వయసు కలిగిన కౌమార దశ బాలికల ఆరోగ్యం పై వైద్య సిబ్బంది ప్రత్యేక దష్టి సారించాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి, టెక్కలి డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ తులసీ అదేశించారు. శనివారం మండలంలోని తిలారు ఆర్‌ఎస్‌లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. పిహెచ్సి పరిధిలో కౌమార దశ బాలికలందరికీ వారి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తెలుసుకొనేందుకు వీలుగా రక్తపరీక్ష లు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైద్య శిభిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీతులసి

ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను అదేశించారు. ఆమెతోపాటు వైద్యాధికారి వంశీ కష్ణ, పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, వైద్య సిబ్బంది గౌరీ, జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పెరుగుతున్న సందర్శకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దాతల సహకారంతో ఆలయ ఔట్ గేటు వద్ద వాటర్ ప్లాంట్‌ను చేశారు. ఈ ప్లాంట్‌ను ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ శనివారం ప్రారంభించారు. అలాగే ఇంద్రపుష్కరణి వద్ద నిర్మించిన గోశాలనూ ప్రారంభించారు. వీటికి కలిదండి నరసింహారాజు, దంపతులు, పెద్దిన కాళిదాసు దంపతులు ఆర్థికంగా సాయమందించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ద్వారపు అనురాధ, మండవిల్లి రవి, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

కూలిన వంతెన

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జగన్నాథపురానికి వెళ్లే ప్రధాన రహదారి కోసం వంశధార కాలువపై నిర్మించిన వంతెన శుక్రవారం రాత్రి కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం కురిసిన వర్షాలకు వంశధార కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించింది. అప్పటికే శిథిలావస్థకు చేరుకున్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. గ్రామానికి వెళ్లేందుకు ఎటువంటి రహదారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని సర్పంచ్ జోగి రాములమ్మ కోరుతున్నారు. మండలంలో ఇటువంటి వంతెనలు కూలేందుకు సిద్ధంగానే ఉన్నాయి. అధికారులు పరిశీలించి ముందుస్తు ప్రమాదాలు జరగకుండా నివారించాలని కోరుతున్నారు.

రూ.30 లక్షలతో ప్రతిపాదన

విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి శనివారం కూలిన వంతెనను పరిశీలించారు. వెంటనే స్పందించి పంచాయతీరాజ్ పిఐయు డిఇ అప్పలసూరితో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి రూ.30 లక్షలతో అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ జోగి రాములమ్మ, వైసిపి నాయకులు అట్టాడ అప్పలనాయుడు, నక్కిట్ల నరేష్, సూరాడ వెంకటేష్, రాజారావు, ఎన్ని మన్మథరావు, పుక్కళ్ల లక్ష్మణరావు, లండ రామారావు, ఉప్పాడ లోకానాథం, బి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాఠశాలల సముదాయాల్లో మార్పులు

రెండు మండలాలకు ఒకచోట

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు మెరుగైన బోధన నిమిత్తం ఏర్పాటు చేసే పాఠశాలల సముదాయాలు నిర్వహణలో మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఒకే మండలంలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు ఆయా మండలాల పరిధిలో ఏదో ఒక పాఠశాలను సబ్జెక్టు సముదాయంగా ఏర్పాటు చేసి నిర్వహించేవారు. అయితే ఇప్పుడు మారిన ఉత్తర్వుల మేరకు రెండు మండలాలకు ఒకేచోట పాఠశాలల సముదాయాలు నిర్వహించాలని పాఠశాలల విద్యాశాఖ ఆధీనంలో ఉన్న సమగ్ర శిక్షా అభయాన్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు సోమ, మంగవారాలు పాఠశాలల సముదాయాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం సమగ్ర శిక్షా అభయాన్ నుంచి ఆదేశాలు శనివారం వెలువడ్డాయి. సోమవారం నుంచి సబ్జెక్టు కాంప్లెక్స్‌లు నిర్వహించనున్నారు. సోమవారం తెలుగు, గణితం, సైన్స్, మంగళవారం హిందీ, ఆంగ్లం, సాంఘీకశాస్త్రం సబ్జెక్టులకు కేటాయించారు. అయితే ఒక మండల కేంద్రంలోని పాఠశాలల సముదాయాలకు వెళ్లేసరికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు తాజా ఉత్తర్వుల ప్రాప్తి మేరకు ఇంకో మండలానికి పాఠశాలల సముదాయాలకు వెళ్లడం అనేది సమయం, ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. రెండు మండలాలకు ఒకేచోట సబ్జెక్టు సముదాయాలు నిర్వహిస్తున్నా నిర్వహణకు సంబంధించి కాల నిర్ణయ పట్టిక ఇంకా విడుదల కాలేదు. దీంతో అజెండా విడుదల కాకపోవడంతో సబ్జెక్టు సముదాయాల నిర్వహణా భారం ప్రధానోపాధ్యాయులపై పడనుంది.

తేదీలు మార్చాలని వినతి

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 28,29 తేదీల్లో నిర్వహించనున్న పాఠశాలల సముదాయం సమావేశాల తేదీలను మార్చాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు కోరారు. ఈ మేరకు డిఇఒ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఎపిసి రోణంకి జయప్రకాష్‌లను శనివారం కలిసి లఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. 29న జాతీయ మాతృ భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ప్రతి పాఠశాలల్లో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తేదీలను మార్పులు చేయాలని కోరారు.

నిధుల గోల్‌మాల్‌పై కొనసాగుతున్న విచారణ

లావేరు: మండలంలోని బుడుమూరు పరిధిలో ఉన్న ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు రణస్థలం మండలంలో ఉన్న ట్రెజరీ కార్యాలయాన్ని విశాఖ రీజన్ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ఎర్రన్న శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రీజన్ పరిధిలో 36 ఎఎంసిలకు సంబంధించిన ఖాతాలను సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేపడుతున్నామని అన్నారు. విచారణ పూర్తియిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రెండు బృందాలు విచారణ చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కార్యదర్శిగా పనిచేసిన సువ్వారి చిన్నికృష్ణ ఎచ్చెర్ల రూ.2,08,00,190 కోట్లు, ఇచ్ఛాపురం ఎఎంసిలో రూ.1,14,57,689 కోట్లు నిధులు గోల్‌మాల్ చేసి సొంత ఖాతాలకు తరలించినట్లు బయటపడింది. గతంలో పని చేసిన కార్యదర్శి ఖాతాను, ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న సతీష్ కుమార్ పేరున బదిలీ చేసేందుకు ట్రెజరీతో పాటు ఎచ్చెర్ల ఎఎంసి కార్యాలయానికి వచ్చామని అన్నారు. ప్రస్తుతం సిఎఫ్‌ఎంఎస్ ఖాతాలు పని చేయకపోవడంతో విచారణ ఆలస్యం అవుతుందన్నారు. ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు పెట్టామని చెప్పారు. కేసు నమోదు కావడంతో విచారణ వేగవంతం అవుతుందని అన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాద్

పుస్తక నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం : గ్రామ సంఘాల ఆర్థిక లేవాదేవీలకు ప్రధానమైన పుస్తక నిర్వహణ రుణాల రికవరిపైన ప్రత్యేక దృష్టిసారించాలని వెలుగు ఎపిఎం ప్రసాద్ సూచించారు. మండలంలోని ఈదుపురంలో మహిళా సంఘాల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘ సభ్యులూ వ్యక్తిగత పాస్ పుస్తకాల్లో తమరుణాలు, పొందుపులు సక్రమంగా ఉన్నాయో? లేవో ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ప్రతి సంఘమూ పొదుపు బ్యాంకు ఖాతాలో ఉన్న పొదుపు నిల్వలు, అంతర్గత అప్పులు ఇచ్చుకొని ఆదాయ కార్యక్రమాల నిర్వహించి కొంత వడ్డీతో తిరిగి చెల్లించుకుని పొదుపులు పెంచుకోవాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ ప్రస్తుతం సంఘాల్లోని వసాయ భూములు ఉన్న రైతు మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లక్ష్యం మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో గ్రామ సంఘ నాయకులు పుష్ప, శాంతి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరాలనుకునే విద్యార్థులకు రెండో విడత విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 1 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నగర అభివృద్ధికి కృషి

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కత్తెర వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిఎం జగన్ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్న దార్శనికుడని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా నుంచి మంత్రిగా పనిచేసిన అచ్చెన్నాయుడు శ్రీకాకుళం నగరానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. విభజన హామీ రాష్ట్రానికి నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం 23 విద్యాసంస్థలు ఇస్తే... ఏ ఒక్కటైనా జిల్లాలో నెలకొల్పారా? అని ప్రశ్నించారు. రూ.500 కోట్లు ఖర్చు చేసి నగరంలో ఉండే 12 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని తెలిపారు. నగరంలో వైద్యానికి, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ చల్లా ఓబులేష, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు, కోణార్క్ శ్రీను, సుంకరి కృష్ణ, ఎన్ని ధనుంజయ్, మండవిల్లి రవి, ప్రకాష్, తెలుగు రమేష్, వానపల్లి రమేష్ పాల్గొన్నారు.

121 మందికి ఉద్యోగ నియామకాలు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం వికలాంగులశాఖ సంయుక్తంగా నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 16 ప్రయివేటు సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 268 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 121 మందిని వివిధ ఉద్యోగాల్లో నియమించేందుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 41 మంది వికలాంగులకు చోటు కల్పించారు. ఈ సందర్భంగా మెప్మా పీడి కిరణ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయిశ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు హాజరై ఎంపిక కాని వారు స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కె.కవిత, నెహ్రూ యువ కేంద్రం యూత్ కో-ఆర్డినేటరు వెంకట్‌ఉజ్వల్, జిల్లా ఉపాధి అధికారి సుధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెచ్ఒడి గోవిందనాయుడు పాల్గొన్నారు.

టిటిడికి ప్రకృతి సేద్య బెల్లం

డిపిఎం రేవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

తిరుపతి దేవస్థానంలోని శ్రీవారి ప్రసాదానికి ప్రకృతి సాగులో సేద్యం చేస్తున్న బెల్లం పంపిణీ చేస్తున్నామని డిపిఎం రేవతి అన్నారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా నిమ్మతొర్లువాడలో ప్రకృతి సేద్య అభ్యుదయ రైతు నక్క చిరంజీవి ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఏడు క్వింటాళ్ల బెల్లాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, చిన్నమ్మడు, శోభన్ మాట్లాడుతూ ఇక్కడి తయారు చేసిన బెల్లం తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్తుందని అన్నారు. దీనివల్ల రైతులకు మంచి ధర వస్తుందని తెలిపారు.

బెల్లాన్ని ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

రాబోయే రోజుల్లో ఎక్కువ మంది రైతులతో బెల్లాన్ని ఎగుమతి చేయడానికి క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. మండల యాంకర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ గడచిన ఎన్నో ఏళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మాకు ఫలితం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ రమణి, కళ్యాణ్, సర్పంచ్ సోమరాజు తేజేశ్వరరావు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రాజశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

108లో క్షతగాత్రుడిని తరలిస్తున్న సిబ్బంది

లైన్‌మేన్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట గ్రామ సచివాలయంలో విద్యుత్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న కింతలి రామ్మోహనరావు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... తొగరాం సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సి తీసుకుని కొర్లకోటలో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్నాడు. ఇంతలో పోల్‌పైన హెచ్‌టి వైరు కలిసిపోవడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. శరీరం కాలిన గాయాలతో ఉన్న క్షతగాత్రున్ని గ్రామస్తులు 108 సహాయంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. ఈయన స్వగ్రామం ఆమదాలవలస పురపాలక సంఘంలోని రెండో వార్డు కృష్ణాపురానికి చెందిన వ్యక్తి.

గాలిలోకి రౌండ్లు కాల్చుతున్న పోలీసులు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

చిట్టివలసకు చెందిన హెడ్ కానిస్టేబుల్ కరుకోల అప్పారావు అంత్యక్రియలు శనివారం తన స్వగ్రామంలో పోలీస్ అధికార లాంఛనాలతో నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... అప్పారావు అనకాపల్లి జిల్లా నాతవరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గత నెలలో విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. అప్పారావు మృతదేహాన్ని స్వగ్రామంలో ఎచ్చెర్ల ఎఆర్ పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పారావుకు భార్య సరళ, కుమార్తెలు భార్గవి, రాజి, కుమారుడు రాజేంద్రలు ఉన్నారు. అప్పారావు మృతితో చిట్టివలస గ్రామంలో విషాదం నెలకుంది.

మాట్లాడుతున్న ప్రకాశరావు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా వృత్తి విద్యాధికారి కోట ప్రకాశరావు అన్నారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది ఇంటర్మీడియట్ విద్య అన్నారు. గతేడాది రాష్ట్రంలో ప్రథమ స్థానం జూనియర్ కళాశాల రావడం ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిందన్నారు. ఈ ఏడాదీ కళాశాలకు అగ్రస్థానం నిలుపుకున్నారని అన్నారు. అనంతరం సంస్కృతి కార్యక్రమంతో విద్యార్థులు కేరింతలు నడుము సందడి చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కిరణ్మయి, అధ్యాపకులు ముకుంద రావు, అజయ్‌కుమార్, సత్తారు లక్ష్మీపతి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతులు

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈ నెల 28న జీడిపిక్కల మద్దతు ధర కోసం చేపట్టనున్న బైక్ ర్యాలీని జీడి రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి జీడి రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని గునుపల్లిలో గ్రామ పెద్ద వాసుపల్లి సాంబమూర్తితో కలిసి బైక్ ర్యాలీ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కంచిలిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ పలాస వరకు నిర్వహిస్తామని తెలిపారు. 80 కేజీల జీడి బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర సాధించే వరకూ రైతులు ఉద్యమిస్తూనే ఉంటారన్నారు. ఈ ర్యాలీలో అన్ని గ్రామాల నుంచి రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుంటు పాపారావు, బాబూజీ, కె.దుర్గారావు, జి.భానుమతి, వినోద్, కోనేరు గురయ్యా, కారి పురుషోత్తం, టి.రాజు, బాలయ్య పాల్గొన్నారు.

గౌతు శివాజీ పరామర్శ

ప్రజాశక్తి- మందస

మండలంలోని ఉగ్రానిపేట బి.రామయ్య, లింబుగాంకు చెందిన తలగాన రాజశేఖర్, సువర్ణపురానికి చెందిన కొంచాడ మురళి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ శనివారం వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన దృషిటకి తీసుకొస్తే తక్షణమే సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. అలాగే మందస మండలం బేతాలపురానికి చెందిన బి.జోగులు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, ముడిపించి నవీన్ కుమార్, కృష్ణారావు, కె.వాసు, మండల లచ్చుయ్య, దున్న తిరుపతి ఉన్నారు.

పరామర్శిస్తున్న శివాజీ